క్లుప్తంగా

కనుల పండువగా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవలో ద్రౌపదీ సమేత అర్జునస్వామి

పుత్తూరు రూరల్: స్థానిక ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో శనివారం అవమాస్యను పురస్కరించుకుని ఊంజల్‌సేవను కనుల పండువగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. రాత్రి 7 గంటలకు అర్జున ద్రౌపదీదేవి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊయలపై ఆశీనులను చేశారు. భక్తి కీర్తనల నడుమ ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.

చింతలపట్టెడలో జనభాగీదారీ



జనభాగీదారీ అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ దళితవాడలో సీడీపీఓ కృష్ణవేణి అధికారులు శనివారం జనభాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీలో ప్రీస్కూల్ ద్వారా జరిపే వివిధ కార్యక్రమాల గురించి ఆమె అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆట, పాట, మాట, కథ, సంసిద్ధత, సృజనాత్మకథ, లోపలి, బయట ఆటలు తదితర కార్యక్రమాల ద్వారా 3 నుంచి 5 సంవత్సరాలలోపు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లులు, అంగన్‌వాడీలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ భూముల వేలం

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణ పరిధిలోని వీరప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన శ్రీఅంకాల పరమేశ్వరి దేవస్థానానికి చెందిన భూములను మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరప్పరెడ్డిపాళెం గ్రామంలోని సర్వే నంబరు 13/6లో 2.40 ఎకరాల భూమిని సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. భూమి లీజు కాల పరిమితి 2023 జూన్ 20వ తేదీ నుంచి 2026 జూన్ 19 వరకు ఉంటుందని స్పష్టం చేశారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు ఒక ఏడాదికి సంబంధించిన పూర్తి గుత్త మొత్తంను చెల్లించి రశీదు పొందాలన్నారు. లీజు కాలం పూర్తయిన తర్వాత డిపాజిట్ మొత్తాన్ని వడ్డీ లేకుండా హెచ్చుపాటదారుడికి వాపసు చేయడం జరుగుతుందన్నారు. ఇతరుల డిపాజిట్ మొత్తాలను వేలం ముగిసిన వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు.


ఘనంగా అర్జున తపస్సు



తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి సమీపంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో విశేష పూజలు చేపట్టారు. అనంతరం అర్జున వేషధారి శివభక్తి గీతాలను ఆలపిస్తూ తపస్మాన్‌ను అధిరోహించే కార్యక్రమాన్ని ఆకట్టుకునేలా ప్రదర్శించారు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు వరపడ్డారు. అర్జున వే షధారి విసిరిన నిమ్మకాయలు, పూజాసామగ్రి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథా కాలక్షేపం జరిగింది.

అన్నదానం ప్రారంభం



అన్నదానం చేస్తున్న డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ

నగరి : పట్టణ పరిధిలో టీటీడీ అనుబంధంగా ఉన్న కరియమాణిక్య స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ శనివారం ప్రారంభించారు. టీటీడీ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శనివారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరగనుంది. నగరి పట్టణానికి చెందిన ఆనం సురేష్ శనివారం ఆలయంలో అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఏకాంబరం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్ పాల్గొన్నారు.

పంట సాగులో విత్తే కీలకం

పంట సాగులో విత్తనాల ఎంపికే కీలకం. విత్తు బాగుంటే దిగుబడి బాగుంటుంది. సరైన విత్తనాలను ఎంపిక చేసుకోకపోతే దిగుబడి తగ్గి అన్నదాతలు నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. రకరకాల వరి విత్తనాలు ఇప్పుడు మార్కెట్‌లో ఉన్నాయి. అయితే రైతులు విత్తన రకాన్ని ఎంపిక చేసుకునే సమయంలో తగు జాగ్రత్తలు వహించాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- నాణ్యమైన విత్తనాలు వాడితే అధిక దిగుబడి
- వాణిజ్య ప్రకటనలు, దళారుల మాటలు నమ్మి చూసి మోసపోవద్దు
- నాణ్యతను పరిశీలించి, గుర్తింపు పొందిన సంస్థలు సర్టిఫైడ్ చేసిన వాటిని కొనాలి
- ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు వ్యవసాయ అధికారుల సూచన



ఓజీకుప్పంలో సాగులో ఉన్న ఏడీటీ 37 పంట



సొసైటీలో ఉన్న విత్తనాలు

నగరి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నగరి వ్యవసాయ శాఖ పరిధిలో 374 ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు. అధిక శాతం బోర్ల ద్వారా ప్రవహించే సాగునీటి ద్వారానే సాగు జరుగుతుంది. వివిధ రకాల భూములు, వాతావరణ పరిస్థితులను బట్టి రెండు పంటలు పండించుకునే ప్రాంతాల్లో మంచి దిగుబడి ఇచ్చే వరి రకం నెల్లూరు సోనామసూరి 34449 గానీ ఏడీటీ 37 గానీ విత్తితే బాగుంటుంది. ఇది తక్కువ నత్రజనితో అధిక దిగుబడిని ఇస్తుంది. పంట చేతికొచ్చే సమయంలో చేలల్లో గింజ మొలకెత్తే స్వభావం తక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో సాగుకు ఇది అనుకూలంగా ఉంటుంది. 160 రోజుల్లో పంట చేతికొచ్చే నెల్లూరు మసూరి 33892 గానీ బీపీటీ 52048 రకం నీరు నిల్వ ఉండే పల్లపు ప్రాంతాలకు అనుకూలం. వర్షాధారమైన పంటకు అనువుగా ఉండే నెల్లూరు మసూరి 34449 వరిని సాగు చేసుకోవచ్చు. సొసైటీలతో పాటు ఆధీకృత డీలర్ల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.

విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు..

- ధ్రువీకరించిన మేలు రకపు విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థల నుంచి గానీ, పరిశోధనా సంస్థల నుంచి గానీ, లైసెన్సు కలిగిన డీలరు నుంచి గానీ మాత్రమే కొనుగోలు చేయాలి
- గుర్తింపు పొందిన సంస్థలు సర్టిఫైడ్ చేసిన విత్తనాలనే కొనాలి
- దళారులు చెప్పిన విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టాలు వస్తాయి.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలరు వద్ద మాత్రమే కొనుగోలు చేస్తే ఇబ్బందులు తలెత్తినప్పుడు ప్రశ్నించే అవకాశం ఉంటుంది.
- విత్తన మొలక శాతం పరీక్షించుకోవాలి.
- విత్తనాల సంచితో పాటు లాట్ నంబర్, కాల పరిమితి తప్పనిసరిగా సరిచూసుకోవాలి. విత్తన సంచిని, ట్యాగ్‌ను, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకూ భద్ర పర్చుకోవాలి.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు..

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వరి విత్తనాలు ఏడీటీ 37 వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 30 కేజీల బస్తా రూ.960కు లభిస్తుంది. అలాగే 10-26-26 ఎరువులు, డీఏపీ, యూరియా కూడా అందుబాటులో ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వీటిని రైతులకు అందిస్తున్నారు. కావలసిన రైతులు వ్యవసాయ సహకార సంఘాన్ని సంప్రదించి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి..



మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు. విత్తనాలు మొలకశాతాన్ని పరీక్షించి నారుమడులు వేయాలి. ఆధీకృత డీలర్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విధిగా డీలరు ఇచ్చే బిల్లులను రైతులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. అప్పుడే విత్తనాల కారణంగా పంట నష్టపోతే నష్టపరిహారం పొందే వీలుంటుంది. – రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

రేపటి నుంచి అడ్మిషన్లు ప్రారంభం



పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ గ్రూపులకు అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యావిధానం 2020 నిబంధనలకు అనుగుణంగా 2023-24 విద్యా సంవత్సరానికి సింగిల్ మేజర్ సబ్జెక్టులతో కొత్త డిగ్రీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. కళాశాలలో బీఏ(ఎకనామిక్స్), బీఎస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ), బీకామ్(జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టులతో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టు, స్కిల్ డెవలప్‌మెంట్, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్, లైఫ్ స్కిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో నేరుగా గానీ, ఏపీఓఏఎండీసీ 2023-24 వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకుని కళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. వివరాలకు 99853 13431, 73966 50368 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



అప్పలాయగుంట గ్రామోత్సవంలో ఉభయ దేవేరీలతో ప్రసన్న వేంకటేశ్వరుడు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో ఆశీనులను చేశారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కన్నుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమాలను ఆలయ అధికారి శివకుమార్, రమణాచార్యులు పర్యవేక్షించారు.

వైఎస్సార్ పశుబీమాపై అవగాహన



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీధర్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పాడి రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వడమాలపేట పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి కోరారు. శనివారం టీసీఅగ్రహారం గ్రామంలో పశు బీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుకోకుండా పాడి పశువులను కోల్పోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రవేశ పెట్టిందే వైఎస్సార్ పశు బీమా పథకమని వివరించారు. సబ్సిడీతో కూడిన ఈ పథకంలో రైతు కేవలం 20 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 80 శాతం చెల్లిస్తుందని తెలిపారు. పాడి ఆవు, గేదెలకు రూ.30 వేలు బీమా చేసుకుంటే ఎస్సీ, ఎస్టీల వారు కేవలం రూ.384, మిగిలిన వారు రూ.960 చెల్లించాలని చెప్పారు. ఈ బీమా మూడేళ్ల కాల పరిమితితో కొనసాగుతుందన్నారు. గొర్రెలు, మేకలకు ఏడాది కాలపరిమితికి ఎస్సీ, ఎస్టీలు రూ.36, మిగిలిన వారు రూ.90 చెల్లించాలన్నారు. పశుసంవర్థక శాఖ సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు పశువులకు బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ ఆఫీసర్ లోకనాథం, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత



మాట్లాడుతున్న ఎంఈఓ నారాయణ

నింద్ర: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మండలంలోని ఆరూరు ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలులో భాగంగా బహుమతులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ దీప మాట్లాడుతూ ఆరూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఝాన్సీ(568), ఢిల్లీబాబు(548), మహాలక్ష్మి (544) మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ తృతీయస్థానాల్లో సాధించారన్నారు. విద్యార్థులకు నగదు బహుమతితో ప్రశంసాపత్రాలను అందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నారాయణ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించండి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో ఆయా కాంట్రాక్టర్లు నాత్యతను పాటించాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఎన్జీఓ కాలనీ, గణపతి నగర్, హరిజనవాడల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. భవానీ నగర్ శ్మశాన వాటికలో పెరిగిపోయిన ముళ్ల పొదలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి గాంచిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగులు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలన్నారు.

మన విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం

పుత్తూరు రూరల్: మన ప్రభుత్వ విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శమని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్ అన్నారు. శనివారం స్థానిక గేట్‌పుత్తూరులోని ఏపీ టీడబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు ఆర్.యశ్వంత్, కె.కుమార్, టి.దేవకు వరుసగా రూ.3 వేలు, 2 వేలు, రూ.వెయ్యి వంతున నగదుతో పాటు మెడల్, సర్టిఫికెట్లను అందజేశారు.

సర్కారు స్కూళ్లలోనే ఉజ్వల భవిష్యత్

వెదురుకుప్పం: సర్కారు స్కూళ్లలోనే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది పడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. ఆర్‌కేఎం పురం జెడ్పీ హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

విద్యకు పేదరికం అడ్డుకాకూడదు

కార్వేటినగరం: విద్యకు పేదరికం అడ్డు కాకూడదని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు అన్నారు. ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఈసీ గ్రూపులో ప్ర తిభ కనబరిచి ఆణిముత్యాన్ని అందుకున్న విద్యార్థిని స్వాతిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



శ్రీకావేరిరాజుపురంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

పాలసముద్రం : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాల పరిధిలోని శ్రీకావేరిరాజుపురం, మిట్టి దళితవాడ, ఆందిఆంధ్రవాడ, అయ్యప్పరాజుకండ్రిగ, సుబ్బరాజు ఇండ్లు గ్రామాల్లో సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి, సర్పంచ్ మహేష్ బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనాన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల స్థాయి అధికారులు, పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వారికి పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిట్టదళితవాడ గ్రామంలో విద్యుత్ తీగలు మార్చాలని, ఆదిఆంధ్రవాడలో మినీ అంగన్‌వాడీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే కట్టకింద ఇండ్లు గ్రామానికి వంతెన కావాలని ఆయా గ్రామస్తులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వారం పది రోజుల్లో ప్రజలు కోరిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ అయ్యప్ప, అనురేఖ, నాయకులు పుత్తూరు కేశవరెడ్డి, ఇందిరమ్మ, సుందరాజు, సుబ్రమణ్యారెడ్డి, ధనుంజయన్, వేణు, త్యాగరాజ్, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, ఏఓ ఢిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఎస్ఐ సురేష్, హౌసింగ్ ఏఈ దాము, విద్యుత్ శాఖ ఏఈ వరదరాజు పాల్గొన్నారు.

కంటి-చూపునకు పునర్జన్మ



కంటి అద్దాలు అందజేస్తున్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి

- పలువురికి ప్రపంచాన్ని మళ్లీ కొత్తగా చూసే అవకాశం లభించింది
- ఈ ఘనత మంత్రి ఆర్‌కే రోజాకు, శంకర నేత్రాలయ బృందానిదే
- పెఫ్సీ, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి

నగరి : ఆర్కేరోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇటీవల 9 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 370 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరిగింది. అలా ఆపరేషన్లు చేసుకున్న వారి సూచనల మేరకు మందులు వాడుకుంటూ వచ్చిన వారిలో 150 మందికి శనివారం ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి భర్త పెఫ్సీ, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి ముఖ్యఅతిథిగా పాల్గొని అందరికీ కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఆర్కే రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో వయోవృద్ధులకు కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించిన ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తి ఇచ్చినట్లు ఆమె పలుమార్లు పేర్కొన్నారని తెలిపారు. కంటిచూపు సక్రమంగా లేక వయోవృద్ధాప్యంలో ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితిలో ఉన్న పలువురికి రూ.2 లక్షల మేర ఖర్చయ్యే ఆపరేషన్ ఉచితంగా చేయించి నేడు ఉచితంగా కంటి అద్దాలు ఇస్తున్నామన్నారు. సరిగా కనిపించకుండా పోయిన ప్రపంచాన్ని వారు నేడు మళ్లీ కొత్తగా చూస్తున్నారని వారి కంటిచూపునకు పునర్జన్మ ఇచ్చిన ఘనత మంత్రి రోజాకు, శంకర నేత్రాలయ యాజమాన్యానికే దక్కుతుందన్నారు. శంకర నేత్రాలయ నిర్వాహకులకు, వైద్యబృందానికి సభాముఖంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అద్దాలు తీసుకోవడానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ భోజనం పెట్టి వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, వాడాల్సిన మందులను అందజేసి ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు బాలన్, శంకర్, వైస్ ఎంపీపీ ఢిల్లీబాబు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు శివరాజు, ఆనందన్, కృష్ణమూర్తి, సలీం, చిన్న దొరై, సర్పంచ్ రవి, జగదీష్, మురుగయ్య, మునస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర అమలు చేయండి



కేబీఆర్‌పురంలో రైతులతో కార్మిక సంఘ నాయకులు

పుత్తూరు రూరల్: మామిడి రైతుల కోసం జిల్లా కలెక్టర్ ప్రకటించిన కనీసపు మద్దతు ధర రూ.15 నుంచి రూ.50 అమలు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ కోరారు. శనివారం పుత్తూరు రూరల్ మండలం కేబీఆర్‌పురం గ్రామంలో మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నల్లమచ్చ కారణంగా మామిడి పంట దారుణంగా దెబ్బతిందని, దీనికి తోడు అకాల వర్షాల కారణంగా కాయలు రాలిపోయి రైతులు నష్టపోయారని చెప్పారు. మిగిలిన అరకొర పంటకు సైతం ఫ్యాక్టరీ యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరతో కొనుగోళ్లు జరుపుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ ప్రకటించిన రూ.15 నుంచి రూ.50కు బదులుగా కేవలం రూ.12 చెల్లిస్తున్నట్లు రైతులు చెబుతున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కేశవులు, మోహన్‌రాజు, ప్రేమానంద్‌రాజు, వెంకటేశులు, సుబ్రమణ్యంరాజు, కార్మిక సంఘ నాయకులు సెల్వా ఆచారి, రవి, భాస్కర్, రమేష్, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి



తహసీల్దార్‌ను రవికుమార్ రాజును సన్మానిస్తున్న కొల్లాగుంట ప్రజాప్రతినిధులు

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్‌రాజు అన్నారు. శనివారం కొల్లాగుంట పంచాయతీలో చేపట్టిన రీసర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకుని తమ ఆస్తిని పదిలంగా ఉంచుకోవాలన్నారు. రీసర్వే చేయడం ద్వారా గ్రామాల్లో తమ ఆస్తులను సులభంగా గుర్తించి పక్కాగా రికార్డు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వివాదాల భూములకు కూడా రీసర్వే ఒక పరిష్కార మార్గమని చెప్పారు. భూసర్వే అనంతరం యజమానికి హక్కు ధ్రువీకరణ పత్రాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత కొల్లాగుంట గ్రామానికి విచ్చేసిన తహసీల్దార్‌ను సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునికృష్ణ, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రమణ్యం, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ సుగుణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గాంధీ పలువురు శాలువలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు వాసు, లోకేష్, వీఆర్‌ఓ గుణ తదితరులు పాల్గొన్నారు.

కాళేపల్లి హైస్కూల్‌కు మహర్దశ



ఆడిటోరియం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : గంగాధరనెల్లూరు మండలంలోని కాళేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు త్వరలో మహర్దశ రానుందని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. శనివారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమె కాళేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థలాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న నాడు-నేడు పనులతో పాటు దాత మాధవరెడ్డి తన తల్లిదండ్రులు శాలమ్మ, వెంకటరెడ్డి జ్ఞాపకార్థం రూ.కోటి వెచ్చించి పాఠశాల ఆవరణలో ఆడిటోరియం, కంప్యూటర్ ల్యాబ్, సైకిల్ స్టాండ్ నిర్మాణంతో పాటు పాఠశాల ప్రహరీ ఎత్తును పెంచి అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధి కోసం దాత మాధవరెడ్డి జెడ్పీసీఈఓకి ప్రతిపాదన పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ దయాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.